

ఉపాధ్యాయులు రాక బడికి తాళం

ఉపాధ్యాయుల తీరు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరి రాజుగారిపల్లి ఎస్సీ కాలనీలోని పాఠశాల నాలుగురోజులుగా తెరుచుకోలేదు. -8లో



బుడుగుంటపల్లెలో ఇసుక క్వారీ

రాజంపేట మండలం బుడుగుంటపల్లెలో నుంచి ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.260
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 490 మెట్రిక్ టన్నులు





నిర్భయంగా విధులు.. అభయంతోనే మొదలు

తమ భద్రతకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలంటున్న మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు

వైద్యులు భగవత్ స్వరూపులు. అలాంటి దైవానికే ఆపదొచ్చింది. వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అవును.. మన గల్లీ మొదలు..ఢిల్లీ వీధుల దాకా వైద్యులపై.. ముఖ్యంగా మహిళా డాక్టరమ్మలపై దాడులు జరుగుతున్నాయి. కొందరు దుండగులు కనీస మానవత్వాన్ని మరచి సాటి మనిషికి ప్రాణం పోసే వైద్యుల ప్రాణాల్నే తీస్తున్నారు. మొన్న కోల్‌కతాలో మహిళా పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన మానవ సమాజంలో ఓ మాయని మచ్చలా మారింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై యావత్ భారతం విస్తుపోయి చూసింది. ఊరూరా నిరసనలు మిన్నంటాయి. ర్యాలీలు.. ధర్నాలతో దేశమంతా దద్దరిల్లింది. ఈ నేపథ్యంలో వైద్యుల, వైద్య సిబ్బంది భద్రతపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలో మహిళా వైద్యులకు రక్షణ ఉందా..పని ప్రదేశంలో వారి భద్రత ఎలా ఉంది.. బాగుందా.. గాలిలో దీపంలా మారిందా.. దుష్ట చూపులేమైనా వెంటాడుతున్నాయా.. అసలు వారు ఏం కోరుకుంటున్నారనే విషయాలపై సాక్షి ప్రత్యేక కథనం.

మాకు రక్షణ కల్పించాలి



రాత్రి వేళ ఏదైనా సీరియస్ కండిషన్‌లో పేషెంట్లు వచ్చినపుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒక క్షణం ఆలస్యం అయినా ఒప్పుకోరు. వాళ్లు బాధపడటాన్ని మేము అర్థం చేసుకుంటాం. కానీ అప్పటికే చాలా రభస చేస్తారు. కొన్ని సార్లు మాపై భౌతిక దాడులకు కూడా పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. భద్రత పెంచి మాకు రక్షణ కల్పించాలి. -ప్రమీల, హెడ్ నర్స్, రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి

అనుచితంగా ప్రవర్తిస్తుంటారు



ఐపీ విభాగాలలో పేషెంట్లు చికిత్స పొందుతున్న సమయంలో వారి సహాయకులలో కొందరు అనుచితంగా ప్రవర్తిస్తుంటారు. కొన్ని సమయాలలో ఎదుర్కోలేక పోతున్నాం. అలాంటి వారిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఐపీ విభాగాలలో సెక్యూరిటీ విభాగం వారు పటిష్టంగా విధులను నిర్వహించాలి. ప్రభుత్వ పటిష్టంగా చర్యలు చేపట్టాలి. - డాక్టర్ దీప్తి, పీడియాట్రిక్ పీజీ వైద్య విద్యార్థిని, రిమ్స్, కడప

వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలి



ప్రతి వార్డులో విధులను నిర్వహించే వైద్యురాలు తాము వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలి. ఎవరికి వారు ఆత్మసంరక్షణలో ఉండాలి. గైనకాలజీ విభాగంలో భద్రతా ప్రమాణాలతో కూడిన రక్షణ సిబ్బందిని నియమించాలి. మహిళా పేషెంట్ల సహాయకులు ఎవరైనా సరే వైద్య సిబ్బంది జోలికి రాకుండా చూడాలి. - డాక్టర్ లక్ష్మీసుశీల, హెచ్‌ఓడీ, గైనకాలజీ, రిమ్స్, కడప



కడప రిమ్స్‌లో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులు

కొనసాగుతున్న రిలే దీక్షలు

కడప అర్బన్: కోల్‌కతాలోని ఆర్‌జీకెఏఆర్ వైద్యకళాశాల పీజీ వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యా ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణంలో 10వ రోజున ఆందోళన ఉధృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం చేపట్టిన రిలేదీక్షలు నాలుగవరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, పరిపాలన విభాగం అధికారులు, వైద్య సిబ్బంది జూడాల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కడప రిమ్స్ గైనకాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డాక్టర్ రబ్బానీబేగం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పనిచేస్తున్న ప్రదేశంలో మొదటగా తామంతట తాముగా ఆత్మరక్షణకు వెనుకాడకూడదన్నారు. ప్రతి వైద్య సిబ్బంది ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు.

రాయచోటి టౌన్/సంబేపల్లె: కోల్‌కతా ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత పెంపు పట్ల ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నాలుగు వందల బెడ్లతో కూడిన సర్వజన ఆస్పత్రి, రాయచోటి, రాజంపేట, పీలేరులో వందల పడకల ఆస్పత్రులు ఉన్నాయి. నిత్యం రోగులతో ఈ ఆస్పత్రులు కిటకిటలాడుతుంటాయి. మదనపల్లె సర్వజన ఆస్పత్రిలో ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినా ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు సిబ్బందితో నామమాత్ర పర్యవేక్షణ జరుగుతోంది. మిగిలిన ఆస్పత్రుల వద్ద ఉన్న భద్రత అంతంతమాత్రమే. ఆస్పత్రుల్లో పగలు, రాత్రి వేళల్లో వైద్యులు, మహిళలు, సిబ్బందిపైన జరుగుతున్న దాడులను నివారించే చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని ఆసుపత్రుల వద్ద సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ ఏజెన్సీల నుంచి పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాల్సి ఉన్నా అలాంటి చర్యలను ప్రభుత్వం గాలికొదిలేసింది. కోల్‌కతా సంఘటన తరువాత ఆస్పుత్తుల వద్ద స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి చేయాల్సిన సూచనలు కూడా ఎక్కడ కనిపించడం లేదు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు పట్టణాల నడి బొడ్డులలో ఆస్పత్రులు ఉన్నా రాత్రి వేళ్లలో వైద్యం కోసం విషమ పరిస్థితుల్లో వచ్చిన వారి నుంచి వైద్యులు, వైద్యసిబ్బంది ఒక్కో మారు రోగి బంధువుల నుంచి దాడులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- లక్కిరెడ్డిపల్లె, బి. కొత్తకోట, తంబళ్లపల్లె, రైల్వే కోడూరు, కలికిరి, తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రులను 30 నుంచి 50 పడకల ఆస్పత్రులుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అప్ గ్రేడ్ అయ్యాయి. దీంతో ఆయా ఆస్పత్రుల్లో టాయ్‌లెట్లు, దుస్తులు మార్చుకునే గదులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అక్కడ పని చేస్తున్న మహిళా వైద్యులు, నర్సులకు వసతి సౌకర్యాలు ఇబ్బంది లేకుండా పోయింది. పీలేరు, రాయచోటి ఆస్పత్రులలో జబ్బుల వ్యాప్తి నుంచి రక్షణ తగిన పరికరాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకరావాల్సి ఉంది. లక్కిరెడ్డిపల్లె ఆస్పత్రి ఊరికి దూరంగా ఉండటంతో రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బందికి తగిన పోలీస్ రక్షణను ఏర్పాటు చేయాల్సి అవసరం ఉంది.

భద్రతా సిబ్బందిని పెంచాలి



నేను గైనకాలజి డాక్టర్‌గా విధులు నిర్వర్తిన్నాను. రోగిని చాలా సీరియస్ కండిషన్‌లో ఆస్పత్రికి తీసుకొస్తారు. అప్పటికే బయట ప్రైవేట్ ఆస్పత్రుల్లోనో.. ఆర్‌ఎంపీల దగ్గరనో వైద్యం చేయించుకొని పరిస్థితి చేయి దాటిపోయే పరిస్థితిలో తీసుకొస్తారు. ఆ సమయంలో వైద్యం పని చేయకపోయినా.. లేదా కాస్త ఆలస్యమై ఏదైనా జరిగితే మాత్రం రోగి సంబంధించిన బంధువులు మాపై దాడులకు పాల్పడతారు. ఆ సమయంలో మా వద్ద భద్రతా సిబ్బంది ఒకరే ఉంటారు. దీంతో వారిని కట్టడి చేయలేని పరిస్థితి. భద్రతాసిబ్బందిని పెంచితే దాడులనుంచి రక్షణ ఉంటుంది. వారి నుంచి కాక పోవడంతో చాలా సార్లు ఇబ్బందులు ఎదుర్కొన్నాము. దాడులకు పాల్పడిన సమయంలో భౌతిక దాడులు కూడా జరుగుతాయి. భద్రత సంఖ్య ఎక్కువగా ఉంటే మాకు కూడా కాస్త దాడుల నుంచి రక్షణ ఉంటుంది. -డాక్టర్ కోటేశ్వరమ్మ, గైనకాలజిస్ట్, రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి

అందరూ ఆవేశంగా వస్తారు



మేము ముగ్గురం సెక్యూరిటీ ఉన్నాం. ఒకొక్కరికి ఎనిమిది గంటలు డ్యూటీ ఉంటుంది. రాత్రి వేళల్లో ఏదైనా సీరియస్‌గా ఉన్నప్పుడే రోగులు వస్తారు. ఆ సమయంలో నిమిషం ఆలస్యం అనిపించినా ...కాస్త సర్ది చెప్పాలని ప్రయత్నించినా మాపైకి దాడికి వస్తారు. కనీసం కనికరం లేకుండా మాట్లాడతారు. ఇవన్నీ మాకు డ్యూటీలో భాగమే. -చంద్రాయుడు, సెక్యూరిటీ సిబ్బంది, రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి

బోధనాసుపత్రిలో భద్రత కరువు

మదనపల్లె: జిల్లాలో మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి 400 పడకలతో అతి పెద్ద ఆస్పత్రిగా ఉంటోంది. పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లోని ప్రజల అత్యవసర వైద్యసేవలకు ఈ ఆస్పత్రినే ఆశ్రయిస్తుంటారు. గతంలో జిల్లా ఆస్పత్రిగా ఉన్న దీన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్వజన బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. బోధనాసుపత్రిలో 35మంది వైద్యుల వరకు ఉంటే... అందులో 20 మందికి పైగా మహిళా వైద్యులు, 32మంది నర్సింగ్ సిబ్బంది, 40మందికి పైగా సహాయకసిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఉన్నారు. బోధనాసుపత్రిలో భద్రతపై మహిళా సిబ్బందిని విచారిస్తే...నైట్ షిఫ్ట్‌లో పనిచేసేటప్పుడు ఒక భవనం నుంచి మరో భవనానికి వెళ్లే క్రమంలో దారిలో భద్రత ఉండదని, సెక్యూరిటీ గార్డ్స్ ఉండరని చెప్పుకొచ్చారు.

1200 ప్రతి రోజూ ఓపీ సంఖ్య..

250 అడ్మిట్ వారి సంఖ్య..

32 నర్సులు

27 సెక్యూరిటీ గార్డులు



మదనపల్లె సర్వజనబోధనాసుపత్రి



బోధనాసుపత్రి పైభాగంలోకి వెళ్లేందుకు చీకటిగా ఉన్న మెట్లదారి

పురుష, మహిళా వైద్యులకు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గదులు లేవన్నారు. వైద్యులపై అక్కడక్కడ జరుగుతున్న దాడులతో పాటు కోల్‌కతా ఘటన వెలుగుచూసిన నేపథ్యంలో బోధనాసుపత్రిలో మరింత సెక్యూరిటీ పెంచితే బాగుంటుందని, ముఖ్యంగా రాత్రివేళల్లో పోలీసుల గస్తీని ఏర్పాటుచేయాలన్నారు. అవుట్‌పోస్ట్‌లో కేవలం ఒకే ఒక కానిస్టేబుల్ ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ఆస్పత్రిలో కొన్ని ప్రాంతాల్లో లైట్లు లేవని, చాలామంది ఆస్పత్రి ఆవరణలో నేల మీద పడుకుంటారన్నారు. ఆస్పత్రిలో అక్కడక్కడా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ భద్రతారీత్యా సరిపోవని వైద్యులు అభిప్రాయపడ్డారు. అలాగే సెక్యూరిటీ గార్డులు సరిపడా లేకపోవడంతో ఏదేని ఘటన జరిగినప్పుడు బాధితులతో పాటు వారి బంధువులు నేరుగా చికిత్స గదుల్లోకి వచ్చేస్తుంటారని, అక్కడ రోగికి ఏమైనా జరిగితే, డాక్టర్లపై దాడులకు తెగబడే ప్రమాదం ఉందన్నారు. వార్డుల్లో రాత్రివేళ రోగుల సహాయకులు మద్యం తాగి పడుకోవడం, సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. పురుష, మహిళా వైద్యులకు విశ్రాంతి తీసుకునేందుకు ఒకటే ఉందని చెప్పుకొచ్చారు. వాష్‌రూమ్ కూడా ఒకటే ఉందన్నారు. రాత్రివేళల్లో గైనిక్‌వార్డులకు వెళ్లాలంటే మరో వ్యక్తి తోడు ఉంటే తప్ప వెళ్లే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ ఉన్న ఆంగ్ల అధ్యాపక ఉద్యోగానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎంవీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంగ్లం బోధించేందుకు ఇంగ్లీష్ పీజీలో 50శాతం ఉత్తీర్ణత సాధించిన వారు ఈ నెల 28న సాయంత్రం లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, 29న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డెమో తరగతులు చెప్పాల్సి ఉంటుందని తెలిపారు.

ఫుట్‌బాల్ జట్టుకు దుస్తుల వితరణ

మదనపల్లె సిటీ: జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతోంది. జట్టు సభ్యులకు గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎవిఆర్ఎస్ కుమార్తె బిందు దుస్తులను వితరణగా అందజేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 20 రోజులుగా క్యాంపు నిర్వహించారు. ఇందులో 22 మందిని ఎంపిక చేసి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మురళీధర్, కమలేష్, కోచ్ మహేంద్ర, హెచ్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్- 14 క్రికెట్ బాలుర జట్టు ఎంపిక

వాల్మీకిపురం: స్థానిక జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 24వ తేది శనివారం ఉదయం 9 గంటల నుంచి అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు జరుగుతాయని ఇన్‌చార్జి షాహెద్, భరత్ తెలిపారు. వాల్మీకిపురం, మదనపల్లి, పుంగనూరు తంబళ్లపల్లి, ములకలచెరువు, గుర్రంకొండ, కలికిరి, కలకడ ఏరియాలకు చెందిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 01.09. 2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్, కిట్టు, తెల్లని దుస్తులతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8317558306, 8247061442 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మా వూరిలో కేకే పెత్తనమేమిటి!

- భగ్గుమన్న జనసేన నేతలు
- డిప్యూటీ సీఎం రాకతో హడావుడి
- పులపత్తూరుకే పరిమితమైన డిప్యూటీ సీఎం ప్రోగ్రాం

రాజంపేట: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ శుక్రవారం రాజంపేటలో పర్యటిస్తున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమం. ఇందులో పార్టీ నేతల పెత్తనం ఉండదు..అంతా అధికారులదే. అయితే జనసేన స్టేట్ కో-ఆర్డినేటర్ హోదాతో కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే) అనే వ్యక్తి వచ్చి పెత్తనం చేయడం ఇక్కడి జనసేన నేతలకు మింగుడుపడలేదు. కేకే పార్టీలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి అండగా నిలుస్తున్నారు. రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు, జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, అసెంబ్లీ సమన్వయకర్తగా అతికారి దినేష్‌ను కలవకుండా ఆయనే సొంతంగా కార్యక్రమ నిర్వహణలో నిమగ్నమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. జనసేన కండువా కప్పుకోని అతికారి కృష్ణతో కేకే చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్నారని నియోజకవర్గనేతలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. కేకే వైఖరిపై జనసేన సీనియర్లు భగ్గుమంటున్నారు.



పులపత్తూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనసేన నాయకులు, పోలీసు అధికారులు

మందపల్లెలోకి రావాల్సిందే...

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బలిజ సామాజికవర్గం ఉన్న మందపల్లెలోకి రావాల్సిందేనని గ్రామస్తులు పట్టుబడుతున్నారు. తమ గ్రామం కూడా అన్నమయ్య డ్యాం వరద బాధిత గ్రామమేనన్నారు. పులపత్తూరు ఒక్కటే కాదు డ్యాం తెగిపోయినప్పుడు ఈ గ్రామాలు కూడా దెబ్బతిన్నాయని డిప్యూటీ సీఎంకు తెలియజేయాలన్నారు. ఆ దారిలో పులపత్తూరుకు వెళుతున్న అధికారగణంతో పాటు జనసేన నేతలను నిలదీశారు. కేవలం పులపత్తూరులోనే డిప్యూటీ సీఎం కార్యక్రమం ఉంటుందని తేల్చిచెప్పారు. దీంతో మందపల్లె, ఎగువమందపల్లె వాసులు రగిలిపోతున్నారు.

- పులపత్తూరు గ్రామానికి డిప్యూటీ సీఎం వస్తున్న సందర్భంగా అధికారులు పలు ఆంక్షలు పెట్టారు. డిప్యూటీ సీఎం కార్యక్రమానికి పక్క గ్రామాలకు చెందిన వారికి అనుమతి లేదని తహసీల్దారు చాంద్ తెలియజేశారు. వివిధ శాఖల అధికారులు పులపత్తూరులో హడావుడి చేస్తున్నారు. కాగా పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసురాజు పులపత్తూరులో ఉండి డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. అభిమానం శృతిమించి డిప్యూటీ సీఎం కార్యక్రమంలో తోపులాట జరిగితే అధికారులను సస్పెండ్ చేస్తారనే భయంతో ఆంక్షలు పకడ్బందీగా అమలుచేస్తున్నారు.

దేవదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు

రామసముద్రం: దేవదాయ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఆయన రామసముద్రం మండలంలోని వివిధ ప్రాంతాల్లో దేవాలయాలకు సంబంధించిన భూములను పరిశీలించారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు రామసముద్రం కేంద్రంలో మఠం భూములను పరిశీలించారు. రికార్డుల ప్రకారం మఠం భూమి 3.16 ఎకరాలు ఉందని, అందులో కొంత భూమిలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే కురిజల గ్రామంలో పూరాతన శ్రీచెన్నకేశవస్వామి ఆలయ పునఃనిర్మాణం చేయాలని గ్రామస్తుల వినతి మేరకు ఆయన సందర్శించి తగు సూచనలిచ్చారు. ఆర్.నడింపల్లి, తిరుమలరెడ్డిపల్లి గ్రామాల్లోని శ్రీవినాయకస్వామి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల ధూపదీప నైవేద్యాల పథకంలో అర్చకుల మార్పు కోసం విచారించారు. అలాగే బల్లసముద్రం సమీపంలోని శ్రీవాలీశ్వరస్వామి ఆలయ ఆక్రమిత భూములు పరిశీలించి వారికి నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆక్రమిత దేవదాయ భూములు సర్వే చేసి హద్దులు గుర్తించి ఇవ్వాలని తహసీల్దార్ నిర్మాలాదేవిని కోరారు. ఆయన వెంట ఈవో రమణ, జూనియర్ అసిస్టెంట్ బాల అంకన్న ఉన్నారు.

రేపటి నుంచి అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

కడప స్పోర్ట్స్: కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం మైదానాలు వేదికగా ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. కర్నూలు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. 24వ తేదీ వైఎస్‌ఆర్‌ఆర్- ఏసీఏ వేదికగా కర్నూలు, నెల్లూరు జట్లు, కేఎస్‌ఆర్‌ఎం/కేఓఆర్‌ఎం మైదానం వేదికగా కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, కబ్జాలు, దాడులు ఎక్కువయ్యాయని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వం లో ఎన్నడూ ఇలాంటివి జరగలేదన్నారు. 4 దఫాలు ఎమ్మెల్యేగా ఉండి 5 సంవత్సరాలు అధికారంలో ఉన్నా ఎన్నడూ ఇలా దాడులు దౌర్జన్యాలు ప్రోత్సహించలేదన్నారు. ప్రఖ్యాత లూథరన్ చర్చి ఆస్తులను రక్షిస్తూ వచ్చామని తెలిపారు. అర్ధరాత్రి రణరంగం సృష్టించి మహిళలు, పిల్లలను భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని తెలిపారు. గుడులు, మసీదులు, చర్చిలకు సంబంధించిన ఆస్తుల జోలికి వస్తే ఊరుకొనేది లేదన్నారు. అన్ని వర్గాల వారికి అండగా ఉంటామని తెలిపారు. తక్షణం పోలీసులు తిమోతి, ఆతని అనుచరులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చూపించాలని లేకపోతే పార్టీ తరపున అన్ని పక్షాలతో ధర్నాలు, నిరసనలు చేయాల్సి ఉంటుందని పోలీసులను హెచ్చరించారు.కార్యక్రమంలో వైఎస్‌ఎంపీపీ రామిరెడ్డిధ్వజారెడ్డి, పంజంసుకుమార్‌రెడ్డి, సీహెచ్‌రమేష్, అన్వర్‌బాషా, ఆరీవ్రమణ, తల్లేంభరత్‌కుమార్‌రెడ్డి, బత్తలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, హరి, రవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు

రామసముద్రం : మండలంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు గురువారం విచారణ చేపట్టారు. ఆదివారం వనగానిపల్లి సమీపంలోని గుమ్మళ్లకుంట చెరువులో వాలీబాల్ ఆడుతుండగా గుంతయంబాడి గ్రామానికి చెందిన ఎస్సీ యువకులు, వనగానిపల్లికి చెందిన యువకులు గొడవ పడ్డారు. దీంతో నవగానిపల్లి, ఏటవాకిలికి చెందిన పలువురు గుంతయంబాడి గ్రామంలో ఎస్సీ కుటుంబ సభ్యులతో గొడవపడి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంపై డీఎస్పీ విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ, ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కురబలకోట : రోడ్డు ప్రమాదంలో బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన పృథ్వీ (25)బుధవారం రాత్రి కంటేవారిపల్లె సమీపంలో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన పృథ్వీతోపాటు అదే ఊరికి చెందిన కుమారి (40), ప్రేమకుమార్ (13) బుధవారం రాత్రి పాలు పోసేందుకు మండలంలోని సింగన్నగారిపల్లెకు మోటార్ సైకిల్‌పై బయలు దేరారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోటార్ సైకిల్ తోలుతున్న పృథ్వీ అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారి, ప్రేమకుమార్ గాయపడడంతో హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

గుర్రంకొండ : ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్న సంఘటన మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఏ.శివశంకర్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో సారాను తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. అతని వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. వాల్మీకిపురం కోర్టుకు నిందితుడ్ని తరలించగా జడ్జి 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయులు రాక బడికి తాళం

- నాలుగు రోజులుగా ఇంతే..
- కస్తూరిరాజుగారిపల్లె ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల మూత
- 29 మంది విద్యార్థులు చదువులేక ఇంటి వద్దే కాలయాపన


పాఠశాలకు తాళాలు వేయడంతో బయట వేచి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఏడాది విద్యార్థులు లేక ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. అయితే విద్యార్థులు ఉన్నా.. ఉపాధ్యాయుల తీరు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఓ పాఠశాల నాలుగు రోజులుగా తెరుచుకోలేదు. దీంతో గ్రామస్తులు తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే.. మరో పాఠశాల మూతపడే పరిస్థితి తలెత్తుతోంది. ఈ సంఘటన లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరిరాజుగారిపల్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 8న స్కూల్ కమిటీ ఎన్నిక జరిగింది. అందులో విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి బాలగుండ్ల వెంకటరమణ అనే వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. చైర్మన్ ఎన్నిక చెల్లదని వాయిదా వేయడం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ నెల 17న మరో మారు స్కూల్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు అధికార పార్టీ నాయకులతోపాటు మండల స్థాయి అధికారులకు, పోలీసులకు వత్తాసు పలికి స్కూల్ కమిటీ ఎన్నికను మోసం చేసి అధికార పార్టీ వారికి బలం లేకపోయినా.. ఆ పార్టీ సానుభూతి పరులు గెలిచినట్లు రాసేసి వెళ్లిపోయారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. 17వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండా తాళాలు వేసుకొని అక్కడే ఉండిపోయారంటూ వారు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామంలోని పాఠశాలలో ఏనాడూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని గ్రామస్తులు తెలిపారు. మా పిల్లలకు చదువు చెప్పడానికి రాకుండా పాఠశాలకు తాళాలు వేసుకొని వెళ్లిపోవడంతో.. ఫోన్ చేసి స్కూల్‌కు రావాలని తెలిపితే తాము సెలవు పెట్టామంటూ సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఒకరు సెలవుపై వెళ్లినా మరొకరు డిప్యుటేషన్‌పై ఇదే పాఠశాలలో పని చేస్తున్నారు. ఇద్దరు కూడా నాలుగు రోజులుగా పాఠశాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎక్కడైనా ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు మండల విద్యాశాఖాధికారి చొరవచూపి పక్క పాఠశాల ఉపాధ్యాయుడినో లేక సీఆర్‌పీలను స్కూల్‌కు పంపించి విద్యార్థులకు చదువు చెప్పాల్సి ఉంది. మరో రెండు రోజులు చూసి ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుంటే మా పిల్లల టీసీలు తీసుకొని, పక్క గ్రామంలో చేర్చుకునే అవకాశం కల్పించాలని వారు వేడుకుంటున్నారు. ఈ తంతు జరుగుతున్నా తమకేమీ తెలియనట్లు మండలంలోని ఇద్దరు విద్యాశాఖాధికారులు వ్యవహరించడం ఆరోపణలకు తావిస్తోంది. ఈ విషయంపై ఎంఈఓ చక్రే నాయక్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా పాఠశాలలో ఆయాగా ఉన్న సుమతి విద్యార్థులకు విద్యను బోధించాలని చెప్పానని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి కూడా పాఠశాల మూత వేయడం ఎందుకని అడుగగా.. అక్కడ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న ఆయమ్మ 29 మంది విద్యార్థులకు చదువు చెప్పాలని తెలిపామని ఎంఈఓ అంటున్నారు. అంగన్‌వాడీ పాఠశాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ పాఠశాల విద్యార్థులకు చదువు చెప్పాలని తెలిపామంటూ ఎంఈఓ వివరణ ఇచ్చారు. ఉపాధ్యాయులే లేకుండా స్వీపర్లు, అంగన్ వాడీ టీచర్లు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చదువు చెప్పేటట్లుగా ఉంటే.. మరి లక్షలాది రూపాయలు జీతం తీసుకుంటున్న ఈ ఉపాధ్యాయులు ఎందుకని ఎంఈఓను అడుగగా సీఆర్‌పీలను పంపించాను అన్నారు. గ్రామస్తులను సీఆర్‌పీలు వచ్చారా, విద్యార్థులకు చదువు చెప్పారా అని అడుగగా.. ఎవరూ రాలేదని, పాఠశాల ఆరు రోజులుగా మూతపడి ఉందని చెప్పారని తెలుపగా ఎంఈఓ ద్వారా సమాధానం లేదు.

స్కూల్ కమిటీ ఎన్నికల రోజు నుంచి..



స్కూల్ కమిటీ ఎన్నికల రోజు నుంచి మా ఊరి బడికి తాళాలు వేశారు. ఇద్దరు టీచర్లు ఉంటే ఇద్దరూ మా బడికి రాలేదు. మా పిల్లలు రోజు బడికి వెళ్లి బయట కూర్చుని ఇంటికి వచ్చేస్తున్నారు. మా పిల్లలను ఎక్కడ చదివించుకోవాలో అర్థం కాలేదు. మా పిల్లల టీసీలు ఇచ్చేస్తే పక్క ఊర్లో చదివించుకుంటాము.
– బాలగుండ్ల భూదేవి, విద్యార్థి తల్లి, కస్తూరిరాజుగారిపల్లె

అయ్యవార్లు రాకపోతే ఎలా?



మా ఊరి బడికి అయ్యవార్లు రాకపోతే మా పిల్లలను ఎక్కడికి వెళ్లి చదివించుకోవాలి. మేము పేదవాళ్లం. ప్రైవేట్ స్కూల్లో చదివించుకునే అంత స్తోమత మా దగ్గర లేదు. మా ఊరి బడికి ఐవార్లు రాక నాలుగు రోజులు అయింది. ఇప్పటికైనా టీచర్లను వచ్చేలా చేయండి. మా బిడ్డలు చదువుకునేలా పై అధికారులు పట్టించుకోవాలి.
– వర్ల వెంకటరమణమ్మ, విద్యార్థిని తల్లి, కస్తూరిరాజుగారిపల్లె

రోడ్డెక్కిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు


ధర్నా చేస్తున్న ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్‌లు

సిద్దవటం : సమస్యల పరిష్కారం కోసం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్‌లు రోడ్డెక్కారు. గురువారం డిపో మేనేజర్ మొండి వైఖరి నిరసనగా భాకరాపేట సమీపంలోని హెచ్‌పీసీఎల్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ డ్రైవర్లు, హెల్పర్‌ల యూనియన్ అధ్యక్షుడు షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ డిపో మేనేజర్ తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని వాపోయారు. సమయపాలన పాటించడం లేదని, నోటీసు బోర్డులో టైమింగ్స్ పెట్టినా పట్టించుకోలేదని తెలిపారు. డ్రైవర్‌లకు భోజన సదుపాయం కూడా లేదని, కంపెనీలో క్యాంటిన్ పెట్టాలని నిబంధలున్నా అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పనిబారంతో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించక నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్యాంకర్ డ్రైవర్‌లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బోరు ఆక్రమణపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ సామాడుపల్లిలోని ప్రభుత్వ బోరును ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించాడని ప్రజలు గురువారం ఎంపీడీవో కేఎస్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాల కోసం గతంలో పంచాయతీ ద్వారా బోరు వేశారని, అయితే నాలుగు నెలల క్రితం సదరు బోరు మోటారు కాలిపోవడంతో మోటారుతోపాటు పైపులు వెలికి తీశారన్నారు. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సదరు బోరు రంధ్రాన్ని పూడ్చేసి ఆక్రమించి చుట్టూ ప్రహరీ గోడ కట్టేశాడని ప్రజలు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా ప్రత్యేక చొరవ చూపుతానని ఎంపీడీవో గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

బొలేరో బోల్తా

నందలూరు : కడప–చెన్నై ప్రధాన జాతీయ రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాకారం సమీపంలో గురువారం కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్లలో బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. కడప పట్టణం చిన్న చౌక్ అశోక్ నగర్‌లో నివాసం ఉంటున్న డి.శివ(45), భార్య ఇందిర, తల్లి సరస్వతితో కలిసి 20 రోజుల క్రితం మదనపల్లెకు వచ్చి చంద్ర కాలనీలో ఉంటున్నాడు. ముగ్గురు భవన నిర్మాణ పనులకు వెళుతూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి శివ ఇంట్లో నుంచి రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డు దాటుతుండగా ఆటో అతన్ని ఢీకొంది. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు.

కారు ఢీకొని..

ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొని పరిస్థితి విషమించిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కురబలకోట మండలం వనమలరెడ్డిగారిపల్లెకు చెందిన మల్‌రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి(50) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వెళుతుండగా, సీటీఎం రైల్వేగేట్ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు అతడిని ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి..

పీలేరు రూరల్ : ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి పీలేరు శివారు ప్రాంతం రాయచోటిరోడ్డు చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై యం.యం.ఫంక్షన్ హాల్‌వద్ద జరిగింది. కె.వి.పల్లె మండలం, వగళ్లకప్పాకు చెందిన ఎస్.ముస్తఫా (50) తన ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు అయ్యాయి.

జింక అడ్డు వచ్చి..

ములకలచెరువు : మండలంలోని మద్దినాయునిపల్లికి చెందిన మునీంద్ర (26) తన ద్విచక్ర వాహనంలో సొంత పనిపై పెద్దపాళ్యంకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతుండగా అకస్మాత్తుగా రోడ్డులోకి జింక అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : దొంగతనం కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 19 గ్రాముల బంగారం, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.యుగంధర్ తెలిపారు. ఆయన గురువారం వివరాలు విలేకరులకు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్లు దోణముక్కలకు చెందిన అంతర్ రాష్ట్ర దొంగలు సాగర్, అతని బావమరుదులైన సచిన్, శ్యామ్‌తోపాటు షేక్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, షేక్ మస్తాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్‌బాషా గత నెల 23న రాత్రి 7.30 గంటలకు స్థానిక మదనపల్లె రోడ్డులో ఓ ఇంటిలోకి చొరబడి జహరాబీ అను ఆమెపై దాడి చేసి, ఆమె వద్ద నుంచి బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు రాత్రి ఒంటిల్లుకు సమీపంలో నివాసం ఉన్న గిరిబాబు నాయుడు ఇంటిలోకి తుపాకులు, కత్తులతో దాడి చేసి పారిపోయినారు. 24న కర్ణాటకలోని గొనిపల్లె, 25న విజయపుర, నందగుడి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా అదే విధంగా నేరాలకు పాల్పడ్డారు. శ్యామ్, సాగర్ అనువారు దోపిడీ కేసులలో వాటాల గురించి ఈ నెల 9న పాణ్యం సమీపంలో గొడవ పడి సాగర్ పిస్టల్‌తో శ్యామ్‌ను కాల్చి చంపాడు. ఆ కేసులో సాగర్ నంద్యాల సబ్ జైలుకు వెళ్లాడు. సచిన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడు. మిగిలిన ఆరుగురు షేక్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, షేక్ మస్తాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్‌బాషా బుధవారం స్థానిక మదనపల్లె రోడ్డులో ఉండగా ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన తరుణ్

కలకడ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవులపల్లె పంచాయతీ హెచ్‌పీసీఎల్ గోడౌన్ సమీపంలో కడపకు చెందిన డి.తరుణ్ (25) కోన గ్రామానికి చెందిన అఖిల్‌రెడ్డి వద్ద జేసీబీ డ్రైవింగ్ నేర్చుకోవడానికి రెండు రోజుల క్రితం వచ్చాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో కోన గ్రామం నుంచి కలకడ వైపు వస్తూ హెచ్‌పీసీఎల్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ముళ్లపొదల్లో పడిపోయి మృతిచెందాడు. రోడ్డు పక్కన కావడంతో ఎవరూ గుర్తించలేపోయారు. సదరు తరుణ్ కోసం చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. ఉదయం రోడ్డు మార్గంలో వెళ్లే వారు గుర్తించి మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే కలకడ పోలీసులకు సమాచారం అందించారు. కడప సెంట్రల్ జైల్ దగ్గర వికలాంగుల కాలనీలో నారాయణ కుమారుడు తరుణ్‌గా గుర్తించి, మృతుని అన్న డి.శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తరుణ్ మృతదేహాన్ని కలకడ మానవత స్వచ్ఛందసేవాసంస్థ సభ్యుల సహకారంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రేమ వ్యవహారమే కారణం


ఆత్మహత్యకు యత్నించిన సోమశేఖర్

మదనపల్లె : ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రియురాలిని తల్లిదండ్రులతో పంపి తనకు అన్యాయం చేశారని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెకు చెందిన రమణ కుమారుడు సోమశేఖర్(22) డిగ్రీ పూర్తి చేసి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తట్టివారిపల్లెకు చెందిన తమ బంధువుల అమ్మాయిని ప్రేమించి, పెద్దలను ఎదిరించి ఈనెల 7న తంబళ్లపల్లె సమీపంలోని ఓ గుడిలో వివాహం చేసుకున్నాడు. యువతి తల్లిదండ్రులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు రాజీ కుదిర్చి పదిరోజుల తర్వాత అందరి సమక్షంలో పెళ్లి చేస్తామని సోమశేఖర్‌ను ఒప్పించి అమ్మాయిని తల్లిదండ్రులతో పంపేశారు. అయితే అప్పటి నుంచీ యువతిని ఎవరికీ తెలియకుండా నిర్బంధించారు. చెప్పినట్లుగా పది రోజుల తర్వాత సోమశేఖర్ స్టేషన్‌కు వచ్చి తన భార్యను అప్పగించాలని కోరడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తనకు అన్యాయం చేస్తున్నారని భావించి ముందుగానే తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు ఆత్మహత్యాయత్నాన్ని భగ్నం చేశారు. కుటుంబ సభ్యుల సహాయంతో మదనపల్లె ఆస్పత్రికి పంపించారు.

బుడుగుంటపల్లెలో ఇసుక క్వారీ


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేట : రాజంపేట మండలం బుడుగుంటపల్లెలో నుంచి ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం స్థానిక రోడ్ల భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు చేస్తోందన్నారు. ప్రజలందిరికీ ఉచిత ఇసుక అందుబాటులో తెచ్చేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే రాజంపేట మండలంలోని ఆర్‌బుడుగంటపల్లె గ్రామంలో ఉచిత ఇసుక త్వరలో లభ్యం కానుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు చేసేందుకు 08561–293006 టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శరాజేంద్రన్ పాల్గొన్నారు.

మహిళలపై దాడికి పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలి


బాధిత మహిళలతో కలిసి మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌతమ్‌కుమార్

మదనపల్లె : రామసముద్రం మండలం ఎంబాడి గ్రామంలో ఎస్సీ మహిళలపై దాడి చేసిన యువకులను వెంటనే అరెస్ట్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బీఎస్పీ కార్యాలయంలో బాధిత మహిళలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆగస్ట్ 18న సాయంత్రం 4 గంటలకు రామసముద్రం మండలం ఎంబాడిలో కొంత మంది ఎస్సీ యువకులు వాలీబాల్ ఆడుకుంటుండగా, పక్క గ్రామమైన ఏటవాకిలి నుంచి కొంత మంది యువకులు మద్యం సేవించి అక్కడికి వచ్చి ఆటలో కలుగజేసుకుని బూతులు తిడుతూ దూషించడం చేశారన్నారు. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించినందుకు వాలీబాల్ ఆడుతున్న యువకులపై దాడికి పాల్పడ్డారన్నారు. తర్వాత అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఎంబాడి గ్రామంలోకి దాడికి పాల్పడ్డ యువకులు బైకులపై వచ్చి... ఇంతకు ముందు తమతో వాదులాటకు దిగిన వారెవరు, రండ్రా అంటూ ఎస్సీ కులానికి చెందిన యువకుల ఇళ్లకు వెళ్లి అందరినీ భయభ్రాంతులు చేశారన్నారు. ఈ క్రమంలో వెంకటరమణ అనే యువకుడిని కొడుతుండగా, అతడి వదిన అంజమ్మ, తల్లి యశోదమ్మలు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే.. కులం పేరుతో దూషిస్తూ వారిపై దాడికి పాల్పడమే కాకుండా వస్త్రాలు చింపివేయడం జరిగిందన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేశామని, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబాడికి చెందిన వెంకటరమణ, ఆంజప్ప, చంద్ర, శశికుమార్, బీఎస్పీ నాయకులు రమణ, సురేష్, కృష్ణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, ప్రసాద్, శివ, అరుణ్, మహేష్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడి

- ఇద్దరికి గాయాలు
- టీ దుకాణాన్ని ధ్వంసం చేసిన టీడీపీ వర్గీయులు
- మైదుకూరు రోడ్డులో హల్‌చల్ చేసిన ముక్తియార్ అనుచరులు


టీ దుకాణంలో దాడికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు


మైదుకూరు రోడ్డులో ప్రధాన రహదారిలో టీడీపీ వర్గీయుల హంగామా


టీడీపీ వర్గీయులను పంపించేస్తున్న పోలీసులు


ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో ఆగిపోయిన బస్సు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ నాయకుల దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన బండి గౌస్‌మొద్దీన్ అలియాస్ అవతార్, అబ్దుల్‌లకు గాయాలయ్యాయి. గురువారం రాత్రి టీడీపీ నాయకుడు ఖలీల్‌బాషా, మరికొందరు వెంటపడటంతో.. 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చాంద్‌బాషాకు చెందిన టీ దుకాణంలోకి వారు పరుగెత్తారు. అక్కడ కూడా వదలకుండా వారిపై దాడికి పాల్పడి టీ దుకాణాన్ని కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌస్‌మొద్దీన్ టీ దుకాణంలో పని చేస్తుండగా అబ్దుల్ టీ తాగేందుకు అక్కడికి వచ్చాడు. అదే సమయంలో టీడీపీ నాయయకుడు ఖలీల్‌బాషా మరి కొందరితో కలిసి అక్కడికి రాగా.. ఇరువురికి మాటకు మాట పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్రంగా గాయపడిన గౌస్‌మొద్దీన్, అబ్దుల్‌లు ఫిర్యాదు చేసేందుకు టూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బంగారుమునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా స్టేషన్ వద్దకు వెళ్లారు. అయితే డీఎస్పీ భక్తవత్సలం సూచన మేరకు స్టేషన్ వద్ద నుంచి వారు వెళ్లిపోయారు. కొద్ది సేపటి తర్వాత టీఎస్ ముక్తియార్ తన అనుచరులతో కలిసి టూ టౌన్ వద్దకు వచ్చారు. ఆయన వెనకాలే పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు రావడంతో.. పోలీసులు స్టేషన్ ప్రధాన గేట్‌ను మూయడానికి ప్రయత్నించారు. అయితే పోలీసులను కూడా తోసుకొని టీడీపీ కార్యకర్తలు స్టేషన్‌లోకి దూసుకెళ్లారు. డీఎస్పీ భక్తవత్సలం, టూ టౌన్ సీఐ యుగంధర్‌లు ఎంత చెప్పినా ముక్తియార్ వినిపించుకోలేదు. తర్వాత స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపోయారు. అయితే ముక్తియార్‌తోపాటు వందలాది మంది ఆయన వర్గీయులు మైదుకూరు రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి హంగామా చేశారు. పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. పెద్ద ఎత్తున జనం గుమికూడటంతో మైదుకూరు రోడ్డులో పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇక్కడి నుంచి వెళ్లాలని పోలీసులు టీడీపీ నాయకులను బతిమాలాల్సి వచ్చింది. కాగా టీడీపీ నాయకుడు ఖలీల్ కూడా తనపై గౌస్‌మొద్దీన్, అబ్దుల్ దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.